# స్మశానంలో వసంతం

'మీ పేరు మాధవరావా?"

తలూపాను.

"మీరు కస్తూరిని చూద్దామని వచ్చారు."

"అవును" అంటూ రెండడుగులు ముందుకు వేసి ఆగి అతని ముఖంలోకి చూశాను. నలభయి సంవత్సరాల వయసు ఉంటుంది. చామన చాయలో పొడుగ్గా ఉన్నాడు.

"ఈ రోజు కాకపోయినా ఆ అమ్మాయి చనిపోయేముందు మీరు తప్పకుండా వస్తారని నాకు అనిపించింది. కూర్చోండి. నాపేరు నరహరి. డాక్టర్ నరహరి" చేయి ముందుకు చాపాడు. అందుకున్నాను.

ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నాను. సాయంత్రం అయిదున్నర అయి ఉంటుంది. గది చిన్నదయినా శుభ్రంగా ఉంది. కర్టన్లు మొదలు బల్లమీద వేసిన గుడ్డవరకు అన్నీ ఆకుపచ్చరంగులో ఉన్నాయి. ట్యూబులైటు బలహీనంగా వెలుగుతోంది.

నరహరి ముందుకు వంగి మోచేతులు బల్లమీద పెట్టి "పాపం,. చిన్న వయసులో... " అని "మీరు హైదరాబాదు లోనో, ఎక్కడో ఉద్యోగం చేస్తున్నట్లు విన్నాను" అన్నాడు.

"హైదరాబాదులో."

"ఏం చేస్తున్నారు?"

చెప్పాను.

"ఈ ఊరు నిన్న వచ్చాను. ఈ ఉదయం నాకు కస్తూరి గురించి తెలిసింది..." అంటోంటే నా మాటలకు అడ్డు తగిలి "ఇలా అడుగుతున్నందుకు మీరు నన్నేమనుకున్నా పర్వాలేదు. ఒక ఆడపిల్లను అన్యాయం చేస్తే మీకేం వస్తుంది?" అడిగాడు. మాటల్లో కోపంలేక పోలేదు.

"నేనా?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"మీ సంగతే నేను మాట్లాడుతుంది."

ఏం మాట్లాడాలో నాకు తోచటం లేదు.

మళ్లీ ఆయనే అన్నాడు, "కస్తూరి జీవితం నాశనం కావటానికి కారణం మీరు..." కుడిచేయి చూపుడు వేలు నా వైపు చూపిస్తూ . "కస్తూరి పిచ్చిదయింది. చాలా ప్రయత్నాలు చేశాం. ఆమె మామూలు మనిషవ్వడం కష్టం. ఆఅమ్మాయిని ఎందుకు మోసం చేశారు? మీకేం అన్యాయం చేసిందని? నేను పర్సనల్ కేర్ తీసుకుని ఆమెను చూస్తున్నాను... " ఆగాడు.

ఆయనలా మాట్లాడటానికి కారణం లేక పోలేదు. సాయం కాలపు వెలుగు పల్చబడుతోంది.

"ఆత్మన్యూనతా భావం ఉంది చూశారూ, స్లో పాయిజన్ లాటిది. మనిషిని తినేసి ఎందకూ పనికిరాని వాడిగా చేస్తుంది. ఇందుకు చుట్టూ ఉండే వాళ్లు, పరిస్థితులు కూడా దోహదం చేస్తాయి. కస్తూరి స్ఫోటకం మచ్చలతో అందంగా ఉండక పోవటం వలన ఈ భావం ఆమెలో ఎక్కువగానే ఉంది. కస్తూరికి మీరంటే చాలా ఇష్టమని విన్నాను. మీరు ఆమె జీవితంలోకి తొంగి చూడకుండా ఉండాల్సింది" అని నా కళ్లల్లోకి చూశాడు. కిటీకీలోంచి బయటకు చూశాను. వేపచెట్టు చీకటి గుట్టలా కనిపిస్తోంది.

"సారీ, ఆవేశంలో కోపంగా మాట్లాడాను. నన్ను మరోలా అనుకోవద్దు. కస్తూరి నాకేం కాదు. నా పేషంటు. అంతే. మీరిప్పుడు ఆమెతో మాట్లాడతారా?"

"మాట్లాడదామనే వచ్చాను" అన్నాను.

"ఆ చివరున్న కటకటాల గదిలో ఉంది. కొన్నోసార్లు ఎగ్రసివ్ అయి ఎవరిని బడితే వాళ్లను అందిన వస్తువుతో కొడుతూ ఉంటే సెల్‌లో పెట్టాల్సి వచ్చింది. ఆయా అక్కడే ఉంటుంది. వెళ్లి కస్తూరిని చూడండి. ఆమె మాట్లాడగలిగితే మాట్లాడండి" అని లేచి నుంచున్నాడు.

"రెండు నిమిషాలు నా కోసం స్పేర్ చేయండి. ఒక్క విషయం చెప్పి వెళ్ళిపోతాను" అన్నాను.

నరహరి అయిష్టంగానే కుర్చీలో కూర్చుని నా ముఖంలోకి చూశాడు.

"నేను లుకేమియా పేషంటును" నెమ్మదిగా అన్నాను.

నమ్మలేనట్లు తల అడ్డంగా ఆడించాడు.

"రెండో స్టేజి దాటింది. నేను బతికేది మరొక ఆరు నెలలు. అంతకు మించి.. " రెండుక్షణాలు ఆగాను. సెల్ఫ్ పిటీవద్దు. నేను చేసేదేమీలేదు. గొంతు సవరించుకుని. "కస్తూరి వాళ్ళిల్లు మా అక్కయ్య వాళ్లింటి పక్కనే ఉంది. ఆమెతో నాలుగయిదు సార్లు

కన్నా ఎక్కువసార్లు మాట్లాడలేదు. ప్రేమసంబంధమయిన సంభాషణ ఎప్పుడూ మా మధ్య జరగలేదు. మీరునన్ను నమ్మండి. నా ఆరోగ్యం గురించి మా ఇంట్లో వాళ్ళందరికీ తెలుసు. కస్తూరికీ తెలిసే ఉండాలి. కస్తూరిని వంచించాలని నేనెప్పుడూ అనుకోలేదండీ... ఈ స్థితిలో ఉన్న నేను, ఎక్కువకాలం బతకనని తెలిసిన నేను...." ఆగాను. ఎవరి ముందు ఏడవటం నాకు ఇష్టం లేదు. గొంతు పెగల్చుకుని మాటలు రావటంలేదు.

లేచి నిలబడి నరహరితో చేయి కలుపుతోంటే "అయాం వెరివెరీ సారీ" అని మాత్రం అనగలిగాడు. నా ఆరోగ్యం గురించి మరికొన్ని విషయాలు అడిగి తెలుసుకున్నాక ఆయన దగ్గిర సెలవు తీసుకుని కస్తూరిని ఉంచిన గదిలోకి వచ్చాను. గదిలో లైటు వెలుగుతోంది. కిటికీలోంచి బయటకు చూస్తున్న కస్తూరి తలుపు తెరిచిన అలికిడికి వెనకకు తిరిగింది. నా అడుగులు ముందుకు పడలేదు. ఈ మూడునెలల్లో చాలా మారిపోయింది. ముఖం పాలిపోయి ఉంది. జుట్టు చాలా మటుకు రాలిపోయి ఉంది. చీరా రవికా తొడుక్కున్న అస్థిపంజరంలా ఉంది. కస్తూరిని అలా చూస్తానని నేను ఊహించలేదు.

"ఎవరు నువ్వు?"అడిగింది.

నన్ను గుర్తు పట్టలేదనుకుంటాను.

"నిన్నే , ఎవరు నువ్వు?" గదమాయించింది.

"నేను, మాధవరావుని."

కస్తూరి చప్పట్లు కొట్టి, "ఎవరక్కడ? భటులారా! ఇటు వెంటనే రండు. ఈ ద్రోహిని బంధించండి" అంది.

అని నన్ను పరీక్షగా చూస్తూ నా చుట్టూ తిరిగి వచ్చి ఎదురుగా నుంచుంది. నా జుట్టు పట్టుకుని "నేను... నేనే మంచిదాన్ని కాను. కొడ్తాను.. చాలా మందిని కొట్టాను. వెళ్లిపో... అయమ్మా! మరే వీడెవడో వచ్చి... నిన్ను కొట్టను. వెళ్లిపో, పొమ్మంటుంటే ..." నా జుట్టు వదిలి దూరంగా జరిగింది.

నేను వాడిన మందుల ప్రభావం వలన నాజుట్టు చాలా మటుకు ఊడిపోయింది. ముప్ఫయి సంవత్సరాలకే యాభయి సంవత్సరాల వ్యక్తిలా కనిపిస్తాను.

"పోవా?" అడిగింది.

తల అడ్డంగా ఆడించాను.

"ఇక్కడే ఉండి పోతావా?"

"ఆ."

"ఎందుకేడుస్తున్నావు?"

"ఏమీలేదు" కళ్ళు తుడుచుకున్నాను.

"ఎందుకొచ్చావు?"

"నిన్ను చూద్దామని."

"భలే భలే. మందేది?"

"మందేమిటి?"

"రోజుకు మూడుసార్లు మందిస్తుంటారుగా. మర్చిపోతే ఎలానోయ్ పుల్లాయ్?"

"తీసుకురాలేదు."

"అయితే నువ్వు మంచి వాడినన్నమాట. డాక్టరు మందుల పిచ్చోడు. బలవంతంగా మందులిస్తుంటాడు. ఒక్క మాటడుగుతాను. నా వంక చూడు. నేను అందంగా ఉంటానా?"

"అందంగా ఉంటావు."

కస్తూరి నా దగ్గిరకు వచ్చి భుజాల మీద చేతులు వేసి, "నిజంగానా?" అడిగింది. చేతులు పుల్లల్లా ఉన్నాయి.

"నిజంగా?"

"నన్ను ముద్దు పెట్టుకుంటావా?"

కస్తూరి నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాను. ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"నన్ను ప్రేమిస్తావా?"

తలూపాను.

"ఉట్టుట్టి ప్రేమకాదు, నిజంగా ప్రేమించాలి."

"ప్రేమిస్తాను."

"ఒట్టు?"

నాకు దుఃఖం ఆగలేదు. కస్తూరిని దగ్గిరకు తీసుకోబోతుంటే ఉలిక్కిపడ్డట్టు నా కళ్లల్లోకి చూసి, నా చేతులు విదిలించుకుని వెనక్కి జరిగి తన చెప్పు తీసి నా ముఖం మీద గట్టిగా కొట్టింది.

◆ కృష్ణా పత్రిక, వారపత్రిక - 31 ఆగస్టు 1968